

అవునో కాదో.. తమరే తేల్చాలి. ముందుగా యక్షుణ్ని రక్షించాల్సి ఉంది. అలాగే మా దత్తకుడికి కాబోయే ఇల్లాలిని, నేను పెళ్లాడాలనుకున్న అమ్మాయిని వెంటపెట్టుకుని, ఈ నగరానికి వచ్చాను. వాళ్లిద్దరూ ఏమయ్యారో కూడా తెలియరావడం లేదు. దీనిని మీరే కనిపెట్టాలి'' అని వేడుకున్నాడు.

తరువాతి విన్నపం గోనర్దీయుడు వినిపించాడు.

''ప్రభూ! మీకు మార్గమధ్యంలో సాయం చేసిన ఘోటకముఖుడు మా మిత్రుడే. అతను ఏమయ్యాడో తెలియకుండా ఉంది. అతణ్ని కూడా మీరు రక్షించాలి. భైరవుణ్ని పట్టుకుని, యక్షుడేమయ్యాడో ఆరాతీస్తే తప్ప అసలు విషయం బయటపడదు!''.

..వారి విన్నపాలు విన్న తరువాత భోజమహారాజు..

''ఇదంతా తేలికగా జరిగే వ్యవహారం కాదు. మరో రెండుమూడు రోజులలో భైరవుడి ప్రదర్శన జరగనున్నది. ఆనాటికి వాడిపని చెబుతాం. అప్పటివరకు మీరు విశ్రాంతి తీసుకోండి'' అని చెప్పి ఆనాటికి సభ చాలించాడు.

మరునాడు పొద్దుటిపూట..

ఐదుగురు మిత్రులూ ఒక ఇంటి చావడిలో కూర్చుని ఉన్నారు. అక్కడికొక ఎడ్లబండి వచ్చి ఆగింది. దాని లోంచి ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలు దిగారు. మిత్రులందరూ వెళ్లి ఆ వచ్చినవాణ్ని కౌగిలించుకున్నారు. అతనే ఘోటకముఖుడు. ఆ స్త్రీలు లోనికి వెళ్లారు.

కుశల ప్రశ్నలు పూర్తయ్యాక ఘోటకముఖుడు తన కథనిలా చెప్పాడు.

''ఆనాడు నేను భోజరాజుగారికి తన ఇల్లాలిని చెరబట్టినవాణ్ని చూపించడానికి ఏకశిలానగరం వెళుతుంటే, దారిమధ్యలో వాడే ఎదురుపడ్డాడు. భోజరాజుగారిని ఒక మేకగా మార్చివేశాడు. నా మీదికి కుక్కలను ఉసిగొల్పాడు. నేను వాటినుంచి తప్పించుకోవడానికి పరుగుపెట్టాను. కొంతదూరం నన్ను తరిమిన తరువాత ఆ కుక్కలు ఏమయ్యాయో తెలియదు. నేను మళ్లీ అడవి మధ్యలో దిక్కుతోచక నిలబడ్డాను.

అటువంటి సమయంలో నాకొక ఆడగుర్రం కనిపించింది. నాకు గుర్రపు స్వారీ వచ్చు కనుక, నేను దానిపై ఎక్కి పశ్చిమోత్తర దిశగా వెళ్లడానికి ప్రయత్నించాను. కానీ దారితప్పాను.

ఆ గుర్రం నన్ను అడవిలో ఒక విచిత్రమైన ప్రదేశానికి తీసుకుపోయింది.

అక్కడొక కుటీరం కనిపించింది. అందులో మనుషులు ఉంటారని తలచి తలుపు తట్టాను. అది దగ్గరికి వేసి ఉంది. ఎవరి అలికిడి కనిపించలేదు. లోపలికి ప్రవేశించాను. స్వల్పంగా సామగ్రి ఉంది. తిన్నగా పెరటిలోకి పోయాను. అక్కడొక నుయ్యి ఉంది. నీళ్లు తోడుకుని, కడుపునిండా తాగాను.

మళ్లీ లోపలికి వచ్చి పరిశీలించగా ఆ గుడిసెలో ఒక గదిమాత్రం తాళం వేసి ఉండటాన్ని గమనించాను. ఈవలికి వచ్చాను.

నేను ఎక్కి వచ్చిన గుర్రం అక్కడే ఉంది. నేను దానికి కృతజ్ఞతా సూచకంగా మెడ నిమురుతూ లక్షణాలు పరిశీలించసాగాను. దాని మెడలో ఏదో తాయెత్తు కట్టి ఉండటం చూసి, దానిని లాగి వేశాను.

నా కళ్లెదురుగానే ఆ గుర్రం ఒక వృద్ధ స్త్రీగా మారిపోయింది.

నేను ఆశ్చర్యపడుతూ..

''అవ్వా! ఎవరు నువ్వు? ఎందుకిలా గుర్రంలా మారిపోయావు?'' అని ప్రశ్నించాను.

అప్పుడామె ఇలా చెప్పింది.

''బాబూ! ఈ కుటీరం నాదే. మేము సారస్వత బ్రాహ్మణులం. నా భర్తతో కలిసి ఇక్కడ చాలాకాలం కాపురం చేశాను. నా పేరు రాధ. నా పుత్రిక పేరు మిత్రవింద. నా భర్త మరణానంతరం నేను ఆ బాలికను ప్రాణంలా చూసుకుంటూ వచ్చాను''.

అని అంతవరకూ చెప్పి..

''రా నాయనా! లోపలికి వెళదాం. నీకు వంట చేస్తాను. ఎన్నాళ్లయిందో కమ్మని భోజనం చేసి. ఈలోపుగా నువ్వు స్నానం చెయ్యి. భోజనం చేస్తుండగా మిగిలిన కథ చెబుతాను'' అన్నది.

నేను అలాగే చేశాను. ఆమె వంట చేస్తుండగా ఆమెతో కొంత సంభాషించాను. ఇందాకా తాళంపెట్టిన గదిలోంచి ఆమె కావాల్సిన వస్తువులన్నీ తీసుకువచ్చి.. అరగంట వ్యవధిలో అనేక రుచులతో భోజనం తయారుచేసింది. నాకు పెరటిలో భోజనం వడ్డించింది. కథ వినేటప్పుడు నా ఏకాగ్రతకు భంగం రాకుండా.. ఆమె వడ్డన చేసేటప్పుడు నా ఆకలికి ఏ మాత్రమూ అడ్డంకి లేకుండా తరువాతి కథ ఇలా చెప్పింది.

''నా కూతురికి పన్నెండేళ్ల వయసున్నప్పుడు.. ఒక నాటి రాత్రి పెద్ద వర్షం పడే సూచనలు కనిపిస్తున్నాయి. మెరుపులు మెరుస్తున్నాయి.

ఆ మెరుపుల వెలుగులో గుర్రమెక్కి ఒక రాజపురుషుడు మా తలుపు తట్టాడు. 'అమ్మా! ఈ రాత్రి మీ ఇంట ఉండవచ్చా? బయట చలితీవ్రత ఎక్కువగా ఉంది. వాన పడేలా ఉంది' అని కోరాడు. నేను అంగీకరించి లోనికి ఆహ్వానించాను. అతనికి వంటచేసి పెట్టాను. నిద్రించడానికి మంచమిచ్చాను.

తెల్లవారిన తరువాత అరుగుమీద కూర్చుని..

'అమ్మా! నిన్ను మరువను. నువ్వు ఒంటరిగా ఈ అరణ్యంలో ఉండటానికి కారణం ఏమిటి? నీకు పిల్లలెందరు?' అని ప్రశ్నించాడు.

అప్పుడు నా కూతురిని లోపలినుంచి పిలిచాను. కొద్దిసేపు దాని అందాన్ని చూసి, అతను మైమరిచిపోయినట్లు కనిపించాడు.

'ఉన్న ఊరు, కన్నతల్లి ఒక్కలాంటివి అని చెబుతారు కదా బాబూ! అయినా మాకిక్కడ ఏ లోటూ లేదు. మాకు చాలా పశువులున్నాయి. కావాల్సినంత పచ్చిక ఉంది. మాకు సరిపడేంత ధాన్యం ఫలిస్తుంది. ఇంక ఇది నా కూతురు.. పేరు మిత్రవింద. దీనికి త్వరలో పెళ్లిచేయాలి' అని చెప్పాను.

ఇంతలో గుర్రాలమీద పలువురు రాజభటులు వచ్చారు.

'జయము జయము మహారాజా!' అని అతనికి వందనం చేశారు.

అప్పుడు విచారించగా ఆయన వరాహ ద్వీపాధిపతి అని తెలిసింది. అతను తన పరివారం వెనుక వెళ్లడానికి ఇష్టంలేక నాలుగురోజులపాటు ఇక్కడే ఉండిపోయాడు. ఐదోరోజున నా కూతురిని గాంధర్వవిధిని వివాహమాడాడు.

నన్నుకూడా తనతోపాటు తమ ద్వీపానికి రమ్మని కోరాడు. కానీ నేను అంగీకరించలేదు. అప్పుడతను..

'ఏ అవసరం వచ్చినా మమ్మల్ని మరిచిపోవద్దు' అని చెప్పి నా కూతురిని తీసుకుని వెళ్లిపోయాడు.

అప్పటినుంచి ఒంటరిగానే ఉంటున్నాను.

ఒకనాడు ఇక్కడికో తాంత్రికుడు వచ్చాడు. అతని దగ్గర చాలా పశువులున్నాయి. వాటితోపాటు క్రూరమృగాలు ఉన్నాయి.

నేనతనికి అడ్డం వెళ్లాను.

'బాబూ! నీ మృగాలు మా పశువులను బెదిరిస్తున్నాయి. కాస్త దూరంగా తోలుకువెళ్లు' అని కోరాను.

అందుకతడు కన్నెర్ర చేస్తూ..

'ఈ అడవిపై నాకు అధికారం ఉంది. నా ఇష్టం వచ్చినచోట నా మృగాలను తిప్పుకొంటాను' అన్నాడు.

'ఈ అడవిపై నీకు అధికారం ఉందని నువ్వు చెబితే.. నీ పశువులపై, మృగాలపై నాకు అధికారం ఉందని నేను చెబితే నీకు కోపం వస్తుందేమో! భగవంతుడి సృష్టి అందరికీ సమానం కదా!' అని నేను చెప్పేసరికి అతనికి పెద్ద కోపం వచ్చింది.

నా నెత్తిపై ఏదో పసరుపూసి నన్నొక గుర్రంగా చేశాడు. ఆ తరువాత జరిగినవన్నీ స్వప్నప్రాయంగా ఉన్నాయి. ఇంతకాలానికి నువ్వు నాకు శాపవిమోచనం కలిగించావు. నా ఇంటికి మళ్లీ నేను నేనుగా తిరిగివచ్చాను. నీకు ఏం కోరినా ఇవ్వాలని ఉంది''..

అని ముసలమ్మ పలికిన మాటలు విని నాకు ఆశ్చర్యం కలిగించాయి.

''అవ్వా! పేదదానివి. ఈ కీకారణ్యంలో ఉన్నదానివి. నువ్వు నాకేం ఇవ్వగలవు?'' అని అడిగాను.

అందుకామె..

''బాబూ! నా దగ్గర కుబేరుని వద్దకూడా లేని ధనరాశులు ఉన్నాయి. ఇందాక మా కొట్టుగదిలోంచి వంటసామాన్లు తీసుకొచ్చాను కదా.. అలాగే నువ్వేం కోరినా తేగలను!'' అని చెప్పింది.

నాకు ఆశ్చర్యం వేసింది.

''అవ్వా! ఈ సంగతి మరెవ్వరికీ చెప్పబోకు. నిన్ను దోచుకోగలరు'' అన్నాను.

''బాబూ! నువ్వు ప్రాణదాతవు కనుక నీకు, అల్లుడు కనుక ఆ మహారాజుకు చెప్పాను. ఈ సంగతులు నా కూతురికి కూడా సరిగా తెలియవు'' అన్నది అవ్వ.

..ఘోటకముఖుడు తన కథను ఇంకా కొనసాగించాడు. ■

**(వచ్చేవారం.. అవ్వకుటీరం - వరాహపురం)**